ఇక క్షణాల్లోనే విద్యుత్ పునరుద్ధరణ

- భద్రాచలంలో పోల్ మ్యాపింగ్ పూర్తి
- ప్రతీ స్తంభానికి నంబర్, డిజిటలైజేషన్
- సమస్యను తక్షణమే గుర్తించడానికి అవకాశం

భద్రాచలంఅర్బన్: విద్యుత్ సమస్యను త్వరితగతిన గుర్తించేందుకు టీజీఎన్పీడీసీఎల్ యాజమాన్యం భద్రాచలంలో పోల్ మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టి పూర్తి చేసింది. ఈ క్రమంలో భద్రాచలంలో ఉన్న ప్రతి స్తంభానికి నంబర్ కేటాయించి, దానిని డిజిటలైజేషన్ చేశారు. దీనిద్వారా ప్రతి స్తంభానికి లెక్క ఉండడంతో పాటు ఎక్కడ సమస్య ఉత్పన్నమైందో వెంటనే తెలుసుకోవచ్చు. ఏ స్తంభం పరిధిలో సాంకేతిక సమస్యలు వస్తున్నాయో పసిగట్టవచ్చు. దీంతో వేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించడానికి అవకాశం ఏర్పడుతుంది.

ఫీడర్లలో పూర్తి..

భద్రాచలం పట్టణంలోని రెండు సబ్ స్టేషన్ల పరిధిలో 33 కేవీ ఫీడర్లు 2 ఉన్నాయి. 11 కేవీ ఫీడర్లు మొత్తం 9 ఉన్నాయి. మొత్తం 2,280 విద్యుత్ పోల్స్ ఉండగా వీటిలో 33 కేవీకి సంబంధించినవి 184.. 11 కేవీకి సంబంధించినవి 2,096 విద్యుత్ పోల్స్. వీటన్నిటికీ నంబరింగ్‌తోపాటు డిజిటలైజేషన్ పూర్తయింది. స్తంభాలకు రెండు రకాల రంగులతో నంబరింగ్ చేయగా, 33 కేవీ ఫీడర్లలో స్తంభంపై పసుపు రంగు వేసి ఆ రంగుపై ఎర్రని రంగుతో నంబర్ వేశారు. కాగా 11 కేవీ ఫీడర్లలో స్తంభానికి పసుపు రంగు వేసి ఈ రంగుపై నల్లని రంగుతో నంబర్ వేశారు. ఇదిలా ఉండగా. టీజీఎన్పీడీసీఎల్ మొత్తం పరిధిలో గల అన్ని జిల్లాల్లో అటు పోల్స్‌కి నంబరింగ్ తో పాటు ఇటు డిజిటలైజేషన్ కూడా పూర్తి చేసిన జిల్లాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదికూడా భద్రాచలం డివిజన్ మొదటి స్థానంలో ఉంది.



11 కేవీ లైన్ విద్యుత్ స్తంభానికి నలుపు రంగుతో నంబర్ వేస్తూ..

ఇదీ ఉపయోగం..

ఈదురుగాలులు, వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు విద్యుత్ లైన్‌లో నిత్యం సమస్యలు తలెత్తుతాయి. తద్వారా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగి వినియోగదారులు ఇబ్బందులు పడుతున్న ఘటనలు నిత్యం చూస్తుంటాం. ఈ నేపథ్యంలో డిజిటలైజేషన్ ద్వారా సమస్య ఎక్కడ తలెత్తిందో త్వరగా తెలుసుకోవచ్చు. పోల్ నంబర్ ద్వారా స్పాట్‌కు చేరుకోవచ్చు. బదిలీల్లో భాగంగా కొత్తగా వచ్చే ఉద్యోగులు కూడా నంబరింగ్ ద్వారా సులువుగా తెలుసుకుంటారు. సిబ్బంది వెంటనే ఆయా ప్రదేశాలకు చేరుకుని వేగంగా సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం సాధ్యమవుతుంది.



33 కేవీ లైన్ విద్యుత్ స్తంభానికి ఎరుపు రంగుతో నంబరింగ్..

సాంకేతికతకు ప్రాధాన్యత



వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం సాంకేతికతకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలోనే భద్రాచలంలో విద్యుత్ స్తంభాల డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టి, పోల్ నంబరింగ్ పూర్తి చేశాం.

– రాజారావు, ఏఈ, భద్రాచలం

లొకేషన్ త్వరగా గుర్తింపు..



పోల్ నంబరింగ్, డిజిటలైజేషన్ ద్వారా లొకేషనను త్వరగా గుర్తించొచ్చు. విద్యుత్ లైన్లలో ఏదేని సమస్య ఉత్పన్నమైతే సిబ్బందికి స్పష్టమైన సమాచారం అందించడానికి ఇది తోడ్పడుతుంది. తద్వారా సిబ్బంది వెంటనే చేరుకుని విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తారు.

– జీవన్ కుమార్, డీఈ, భద్రాచలం

ఇష్టారీతిన ఇసుక తోలకాలు!

తేదీ, సమయం రాయకుండానే సంతకాలు?

ములకలపల్లి: ఇందిరమ్మ ఇసుక తోలకాల్లో గందరగోళం నెలకొంది. మండలంలోని సీతారాంపురం శివారులోని మొర్రేడు వాగు నుంచి శుక్రవారం అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాలకు 20 ట్రాక్టర్లకు పైగా ఇసుకను తరలించారు. అన్ని రకాల అనుమతులు ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ అందులో వాస్తవం లేదని సమాచారం. కూపన్లలో బ్లాక్, బ్లూ రంగులు కనిపించడం గమనార్హం. పత్రం మొత్తం బ్లాక్ కలర్‌లో కనిపిస్తుండగా, తేదీ, సమయం బ్లూ ఇంక్‌తో నింపడం అనుమానాలకు తావిస్తోంది. ఏరోజుకారోజు అనుమతి ఇవ్వాల్సి ఉండగా, రెవెన్యూ కార్యాలయం నుంచి ఒక్కరోజు ముందుగానే అనుమతి ఇవ్వడం ప్రశ్నార్థకంగా మారింది. ఈ కూపన్లలో తేదీ, సమయం లేకుండానే తహసీల్ నుంచి బయటికి వెళ్లడం గమనార్హం. కాగా, ఈ విషయంపై తహసీల్దార్ భూక్యా గనియాను వివరణ కోరగా.. పని ఒత్తిడి నేపథ్యంలో ముందుగానే కూపన్లు ఇచ్చామని, అక్రమ తోలకాలకు అవకాశమే లేకుండా చూస్తున్నామన్నారు. సీతారంపురం పంచాయతీ కార్యదర్శి రాంబాబును వివరణ కోరగా.. తహసీల్ నుంచి ఒక్కరోజు ముందుగానే కూపన్లు ఇచ్చారని, ర్యాంప్ నుంచి ట్రాక్టర్ బయటికి వచ్చిన సమయం చూసి, కూపన్లలో టైం నమోదు చేస్తున్నామని వెల్లడించారు.


ఇసుక కూపన్లను బ్లాక్, బ్లూ రంగులతో నింపిన దృశ్యం

న్యాయ అవగాహన సదస్సు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్ర పాఠశాలలో శుక్రవారం న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది పాఠశాలకు సంబంధించిన పలు సమస్యలను వివరించారు. పాఠశాల చుట్టూ పిచ్చి పొదలు దట్టంగా పెరిగి పాములు తరుచూ వస్తున్నాయాని తెలిపారు. అత్యవసర సమయంలో నీళ్లు దగ్గర లేక దూర ప్రాంతం నుంచి తెచ్చుకోవలసి వస్తుందని వాపోయారు. పాఠశాల సమస్యపై న్యాయమూర్తికి వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని న్యాయమూర్తి హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రమ, పద్మావతి, సుమలత, కనకరాజు, ఆవులూరి సత్యనారాయణ, నాగ అంబేడ్కర్, పామరాజు తిరుమలరావు, చల్లా శివ కృష్ణ, గాయత్రి, సునీత తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న న్యాయమూర్తి శివనాయక్

క్లుప్తంగా

సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్


స్వచ్ఛత కార్యక్రమంలో సెంట్రల్ వాటర్ కమిషన్ అధికారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థాన పరిసరాల్లో సెంట్రల్ వాటర్ కమీషన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో స్వచ్ఛత క్యాంపెన్ 5.0లో భాగంగా శుక్రవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సమీపంలోని రోడ్లపై ఉన్న చెత్తను శుభ్రం చేశారు. అనంతరం స్థానిక ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని సూచించారు. గణేష్ కుమార్, పృథ్వీరాజ్, సుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యా విధానానికి కృషి చేయాలి


సభ్యత్వ నమోదు రశీదులు అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మణుగూరురూరల్: శాస్త్రీయ విద్యావిధానం కోసం కృషి చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి వరక అజిత్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అజిత్ మాట్లాడుతూ.. కార్పొరేట్, ప్రైవేటీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న తీరుపై విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పవన్‌సాయి, కళ్యాణి, సుప్రియ, మానస తదితరులు పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు సన్మానం


ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న దృశ్యం

ములకలపల్లి: మండలపరిధిలోని రామచంద్రాపురం పాఠశాలలో విధులు నిర్వహించి, బదిలీ అయిన టీచర్లను శుక్రవారం ఘనంగా సత్కరించారు. స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగన్నాథపురం కాంప్లెక్స్ హెచ్ఎం వెంకట నర్సమ్మ, హెచ్ఎం రమేశ్ రాథోడ్ మాట్లాడారు. టీచర్లు గుగులోతు కృష్ణ, భూక్యా వినోద, జానకిలతోపాటు, పదోన్నతిపై వెళ్ళిన బాణోతు సురేష్‌లను దుశ్శాలువలతో సన్మానించారు. పీఆర్‌టీయూ మండల కార్యదర్శి తేజావత్ వెంకటయ్య, చందర్, రాజేంద్రప్రసాద్, కిషన్, చీమల రాంబాబు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడు మృతి

మణుగూరురూరల్: మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు ఎల్లు రామయ్య(60) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మండల, పట్టణ కార్యదర్శులు జక్కుల రాజబాబు, దుర్గ్యాల సుధాకర్‌లు వారి గృహానికి వెళ్లి రామయ్య భౌతికకాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంతాపం తెలిపిన వారిలో పార్టీ నాయకులు జంగం మోహన్‌రావు, ఎస్‌కె.సర్వర్, ఎడారి రమేష్, ఆధర్ల రాములు, కొత్తపల్లి సీతారాములు, పులిగిల రమేష్, రవి, లక్ష్మారెడ్డి, యాకుబ్, తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

దమ్మపేట: త్వరలో వరి కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ, సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన అనంతరం తహసీల్దార్ భగవాన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. గతంలో రైతులకు పెండింగ్‌లో ఉన్న వరి బోనస్‌లను చెల్లించి, సన్న రకం వరికే కాకుండా అన్ని రకాల ధాన్యానికి రూ.500ల బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు, రావుల శోభన్, కొప్పుల శ్రీను, బ్రహ్మయ్య, రమేష్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల కోసం ధర్నా


ములకలపల్లి: మాట్లాడుతున్న రాంబాబు

ములకలపల్లి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం వెంటనే జీవో జారీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు అన్నారు. పార్టీ రాష్ట్రకమిటీ పిలుపులో భాగంగా ములకలపల్లిలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసినా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమోదం తెలుపకుండా బీసీలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఊకంటి రవికుమార్, నిమ్మల మధు. గోపగాని లక్ష్మీనర్సయ్య, బైరు ప్రసాద్, చేడే పద్మ. సోయం కృష్ణ. మంచాల సారయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్ట్

అశ్వాపురం: రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం రాజ్‌భవన్ ముట్టడికి పిలుపునివ్వడంతో శుక్రవారం మండల సీపీఎం నాయకులను అశ్వాపురం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో పార్టీ నాయకులు గద్దల శ్రీనివాసరావు, దండి రాములు, సాంబశివరావు, బొడ్డు రాములు, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

న్యాయమూర్తిపై దాడికి నిరసన

పినపాక: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై ఇటీవల జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ నాయకులు వల్లేపోగు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పినపాక మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు, బీసీ సంఘాల నాయకులతో కలిసి నిరసన తెలియజేశారు. అనంతరం తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

బూర్గంపాడు: ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టి అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్యకు వినతిపత్రం అందించారు. రావులపల్లి ఈశ్వరయ్య, సాంపాక అబ్బులు, వెంకన్న, మిర్యాల నర్సింహారావు, చెక్క వెంకటేశ్, మిర్యాల దుర్గాప్రసాద్, ఇనపనూరు గోపి, వడ్లకొండ పున్నం, తోకల లక్ష్మయ్య పాల్గొన్నారు.

దమ్మపేట: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టిన అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కోలికపోగు కాంతారావు, వెంకటరమణ, ముసలయ్య, రవి, జేమ్స్, వీరయ్య, పార్వతి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. తహసీల్దార్ వట్టం కాంతయ్యకు వినతిపత్రం అందజేశారు. నాయకుడు వల్లేపోగు వెంకటేశ్వర్లు, జగన్నాథం, వెంకటేశ్వర్లు, నరసింహారావు, నరేష్, సాయి, అర్జున్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


బూర్గంపాడు: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సీపీఆర్‌పై వైద్యుల అవగాహన

పినపాక: గుండెపోటు గానీ, ఆకస్మాత్తుగా గుండె కొట్టుకోవడం ఆగి పోయిన వ్యక్తులకు సీపీఆర్ చేసి ఫలితం రాబడితే బాధితుడికి పునర్జన్మ ఇచ్చినట్లే అని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు డాక్టర్ మధు తెలియజేశారు. శుక్రవారం సీపీఆర్ డే పైన పినపాక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎస్ఐ సురేష్ హాజరయ్యారు. గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సవివరంగా వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామపంచాయతీ సెక్రటరీలు, గ్రామపంచాయతీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించాలి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు శనివారం చేపట్టనున్న బంద్‌కు సహకరించాలని బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ తదితర పార్టీలతోపాటు బీసీ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం దుకాణాదారులను కలిసి విన్నవించారు. కొందరు నాయకులు సమావేశాల ద్వారా మరికొందరు పత్రికా ప్రకటనల ద్వారా బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. రిజర్వేన్ల విషయంలో కేంద్రంలోని బీజేపీ వైఖరిని నిరసిస్తూ.. నిరసనలు, ర్యాలీలు చేపట్టారు. – సాక్షి నెట్‌వర్క్


అశ్వాపురం: మొండికుంటలో బంద్‌కు సహకరించాలని కోరుతున్న నాయకులు


మణుగూరుటౌన్: సీపీఐ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కరకగూడెం: మణుగూరు నుంచి ఏడూళ్ల బయ్యారం వరకు 33 కేవీ రెండో లైన్ పనుల దృష్ట్యా నేడు (శనివారం) ఉదయం 09:00 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంటల వరకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని మండల ఇన్‌చార్జ్ ఏఈ రాజశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పనుల దృష్ట్యా వినియోగదారులు ఈ సమయంలో సహకరించాలని ఆయన కోరారు.

21న ఇసుక వేలం

ములకలపల్లి: వివిధ ఘటనల్లో పోలీసులు సీజ్ చేసిన ఇసుక విక్రయానికి ఈనెల 21న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భూక్యా గనియా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు ట్రాకర్లు, ఒక టిప్పర్ లారీలోని 36 క్యూబిక్ మీటర్ల ఇసుక వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏజన్సీ ప్రాంతం నేపథ్యంలో గిరిజనులు మాత్రమే పాటలో పాల్గొనేందుకు అర్హులని స్పష్టం చేశారు.

లంబాడీలకు ఎస్టీ ధృవీకరణ ఇవ్వొద్దు

చంద్రుగొండ: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో లంబాడీలకు ఎస్టీ ధృవీకరణ పత్రాలు ఇవ్వొద్దని ఆదివాసీ (తుడుందెబ్బ) మండల అధ్యక్షుడు కే నర్సింహారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ ఇన్‌చార్జ్‌కి వినతిపత్రం అందించారు. లంబాడాలు నిబంధనలకు విరుద్ధంగా రిజర్వేషన్లు పొందుతున్నారని ఆయన ఆరోపించారు.

అన్నపురెడ్డిపల్లి ఎస్ఐగా విజయసింహారెడ్డి



అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): అన్నపురెడ్డిపల్లి ఎస్ఐగా ఎడవల్లి విజయసింహారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన చావల చంద్రశేఖర్ బదిలీపై లక్ష్మీదేవిపల్లి స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న విజయసింహారెడ్డి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఏజెన్సీలో ప్రత్యేక చట్టం చేయాలి

బూర్గంపాడు: ఏజెన్సీలో షెడ్యూల్ ట్రైబల్స్‌కు విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి జయబాబు డిమాండ్ చేశారు.

మోరంపల్లిబంజర జెడ్పీఎస్ఎస్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖ చేపట్టిన పదోన్నతులలో షెడ్యూల్ ట్రైబల్ ఉపాధ్యాయులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం అవకాశాలు కల్పించాలన్నారు. పీఆర్‌సీ, పెండింగ్ డీఏ, జీపీఎఫ్ లోన్లను వెంటనే ప్రభుత్వం క్లియర్ చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు కారం గాంధీ, జీవీ రాంప్రసాద్, శేష గిరిరావు,రేసు వెంకటేశ్వర్లు, కల్లి నాగేశ్వరరావు, తాటి రమాదేవి, బైటి బాబూరావు, పూర్ణచందర్‌రావు,శ్యామల, కోటేశ్వరరావు, రంగారావు, తాటి సీత, హేమ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో టపాసుల విక్రయ దుకాణాల స్థలం మార్పు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో టపాసుల విక్రయ దుకాణాల ఏర్పాటు స్థలాన్ని మార్పు చేశారు. ప్రతి ఏడాద పట్టణంలోని బ్రిడ్జి పాయింట్‌లో గల కరకట్ట మీదగా రాఘవా నదీలయంకు వెళ్లే దారిలో ఏర్పాటు చేస్తుంటారు. అయితే ఆ స్థలం టూరిజం శాఖకు సంబంధించినది. ఆ స్థలంలో ఈ ఏడాది టపాసుల విక్రయ దుకాణాల ఏర్పాటుకు ఆ శాఖ అధికారులు మౌఖికంగా అంగీకరించినప్పటికీ అధికారికంగా అనుమతినివ్వలేదు. దీంతో ఆ ప్రాంతంలో దుకాణాల ఏర్పాటుకు అగ్నిమాపక శాఖ అధికారులు నిరాకరించారు. వెరసి ఆ ప్రాంతానికి కొంత దూరంలో ఉన్న ఆర్అండ్‌బీ శాఖ స్థలంలో దుకాణాల ఏర్పాటుకు తహసీల్దార్ వెంకటేశ్వర్లు, భద్రాచలం అగ్నిమాపక శాఖ ఎస్ఐ శ్రీనివాస్ అంగీకరించారు. దీంతో శుక్రవారం రాత్రి షాపులను ఏర్పాటు చేసుకుంటున్నారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

పినపాక: మండల పరిధిలోని గోపాలరావుపేట గ్రామంలో దీపావళి మెగా వాలీబాల్ టోర్నీ తహసీల్దార్ గోపాలకృష్ణ ప్రారంభించారు. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల వైపు దృష్టి మళ్లించడంపై నిర్వాహకులను ఆయన అభినందించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామనాథం, గోపాలరావుపేట యూత్ పాల్గొన్నారు.

జోనల్ క్రీడలు..

దమ్మపేట: మండల పరిధిలోని పార్కలగండి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జోనల్ స్థాయి క్రీడ పోటీలను హెచ్ఎం రవి ప్రారంభించారు. ఆశ్రమ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పలు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. జోనల్ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను, నవంబరులో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఏఎస్ఓ వెంకట నారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొసైటీలకు అవకాశాలు కల్పించాలి

మణుగూరుటౌన్: ఐటీడీఏ పీఓ ఆదేశాల ప్రకారం బీటీపీఎస్‌లో ఆదివాసీ సొసైటీలకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సొసైటీలు, ఎస్టీ కోయ కాంట్రాక్టర్ల జేఏసీల ఆధ్వర్యంలో శుక్రవారం ప్లాంట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. బీటీపీఎస్‌లో సెమీ స్కిల్డ్, అన్‌స్కిల్డ్ వర్కులు బాయిలర్ టర్బైన్ కూల్ క్లీనింగ్, ఈఎస్పీ బిల్డింగ్ మెయింటెనెన్స్, గార్డెన్ క్లీనింగ్, తదితర పనులు స్థానిక ఆదివాసులకు కేటాయించాలన్నారు. ఎస్టీ కోయ కాంట్రాక్టర్ల జేఏసీ నాయకులు, నాగేశ్వరరావు, శ్యామ్, శంకర్, బొగ్గం రమేశ్, గొట్టం ఝాన్సీ, కాయం తిరుపతమ్మ, గోపాల్, స్వరూప తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్ల ఔదార్యం..


దంపతులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దర్శనానికి వచ్చిన ఒంగోలుకు చెందిన భక్తుల పర్సును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేయగా.. దిక్కు దోచనిస్థితిలో వారు ఆలయ పరిసరాల్లో తిరుగులాడారు. ఆటో డ్రైవర్ల వద్దకు వెళ్లి విషయం చెప్పారు. దీంతో వారు యూనియన్ తరుపున చందాలు వేసుకుని పర్సు పోగొట్టుకున్న దంపతులు ఒంగోలు చేరుకునేందుకు రూ.1800 అందజేశారు. ఆటో యూనియన్ ప్రెసిడెంట్ శ్రీను తదితరులున్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

మణుగూరుటౌన్: అక్టోబర్ 28–30 వరకు విద్యారంగ సమస్యలపై, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ చేపట్టనున్న తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వనపర్తి జిల్లా కేంద్రంలో కార్యవర్గ మహాసభలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకలు ప్రమీల, సరోజిని, కేశవర్ధన్, సంతోష్, లోకేశ్, ప్రణయ్, నవ్య తదితరులు ఉన్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లోని పాన్‌షాపులు, కిరాణా షాపుల్లో సీఐ, ఎస్సైల ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. నిషేధిత మత్తు పదార్థాలు నిల్వ ఉంచడం, విక్రయించడం తదితర విషయాలపై సోదాలు నిర్వహించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలను చాక్లెట్, సిగరెట్ రూపంలో ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై సమాచారముంటే పోలీసులకు అందించాలని సూచించారు. – సాక్షి నెట్‌వర్క్


మణుగూరురూరల్: దుకాణాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు


దుమ్ముగూడెం: ములకపాడులోని పాన్ షాప్‌లో..


అశ్వాపురం: మత్తు పదార్థాలతో నష్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్‌రెడ్డి